శాస్త్రిగారు కంగారుగా కనపడ్డ వాళ్ళందరిని కొడుకు గురించి ఆజర అడిగారు ఏ సంగతి అంతుబట్టలేదు. ఐదోరోజు కాంతమ్మ ఏడుపు ఆరంభించింది. వూర్లో వాళ్ళందరూ నూతులు, చెరువులు వెదకమన్నారు. దాంతో ఆ దంపతులిద్దరూ మరింత గాభరాపడ్డారు. పోలీసురిపోర్టు యీయమన్నారు మరికొందరు. పట్టణాలలో అడుగడుగున ఏవో ఏక్సిడెంటులు జరుగుతూనే వుంటాయి. వెళ్ళి పోలీసు స్టేషనులో వాకబుచెయ్యండి అంటూ మరింత భయపెట్టారు అందరూ. శకరం స్నేహితులు టౌనుకెళ్ళి పోలీస్‌స్టేషన్‌కెళ్ళి రిపోర్టిచ్చారు అక్కడ ఏక్సిడెంటు కేసులు యిద్దరు ముగ్గురు ఆస్పత్రిలో వున్నారంటే వెళ్ళిచూసి శంకరంకాదని తేల్చుకువచ్చారు. శాస్త్రిగారి ముఖ్య బంధువులకి శంకరంవస్తే తెలుపమంటూ వెళ్ళిన టెలిగ్రాంకి రాలేదన్న టెలిగ్రాం జవాబులు వచ్చాయి. దాంతో కాంతమ్మ భోరుమని ఏడుస్తూ కూచుంది. తిండి తిప్పలు మాని భార్యాభర్తలు ఏం చెయ్యడానికి తోచకదిగాలుపడి కూర్చున్నారు. కాంతమ్మ మొగుడిమీద విరుచుకు పడింది. ''వాడిల్లు వదిలిపోయాడు. ఉద్యోగంలేదు ఉద్యోగంలేదు అంటూ వాడ్ని నానామాటలు అన్నారు. మీ సూటిపోటిమాటలకు వాడిమనసు విరిగిపోయింది. మీరు వాడిని అడుగడుగునా తిని కూర్చుంటున్నాడని హీనంగా చూస్తుంటే భరించలేక ప్రాణం విసిగి ఎటోవెళ్ళిపోయాడు నా నాయన అవమానం భరించలేక ఏ నుయ్యో గొయ్యో చూసుకుని వుంటాడు. నా బిడ్డ ఏ అఘాయిత్యం చేశాడో, పాతికేళ్ళవాడు - మాటపడలేక యిల్లు వదలి పోయాడు. ఎక్కడున్నాడో, ఏమయ్యాడో అసలున్నాడో లేడో... యింకేం మీ కళ్ళు చల్ల పడ్డాయికదా, యింక సాయిగా వుండండి, 'సంతోషించండి'' కడుపు తీపితో, బాధతో భర్తని దూషిస్తూ తల మొత్తుకుని ఏడ్చింది కాంతమ్మ. శాస్త్రిగారు దోషిలా తలవంచుకున్నారు. ఆయనకీ అదే అనుమానం మనసులో తొంగి చూసింది. కొంపతీసి అన్నంతపని చేశాడేమో! ఉద్యోగం లేకపోవడం. యింటి పరిస్థితులు, మంచిరోజులు వస్తాయన్న ఆశలేక, ప్రాణం విసిగి ఏ అఘాయిత్యమో చేసివుంటాడు! లేకపోతే యిన్నాళ్ళు ఏమవుతాడు యింటికిరాక! ఏదో కష్టలకి మనసు చెదిరి, ఆదుకుంటాడనుకున్న కొడుకు అప్రయోజకుడై నాడన్న ఆవేదన, డబ్బు యిబ్బందులు తనని వశపరచుకుని అప్పుడప్పుడు కొడుకుమీద విసుక్కున్న మాట నిజమే! కాని ఆ మాటలకి యింత పని చేస్తాడనుకోలేదు ఆయన. ''ఎక్కడని వెతకను, ఏం చెయ్యను. ఏం పనిచేశావురా నాయనా!'' అంటూ శాస్త్రిగారు మనసులో కుళ్ళి కుళ్ళి ఏడ్చారు.

కొడుకు కనపడకపోయి ఏడు రోజులు అయింది. తిండి తిప్పలు మాని కాంతమ్మ ఏడుస్తూ పడుకుంది ఇరుగు పొరుగువచ్చి ఓదార్చి సానుభూతి మాటలు చెప్పుతున్నారు.

సరిగా అదే సమయంలో పోలిగడు పరుగు పరుగునవచ్చి శంకరం ఊరి బయట పాడుబడిన శివాలయంలో ఉన్నాడన్న వార్త అందించాడు.

పోలిగాడు రోజూ ఊరి బయటికి ఎటో అటు గొడ్లని మేపడానికి వెడతాడు. ఆ రోజు శివాలయంవైపుకి వెళ్ళి గొడ్లని వదిలి, ఆలయం బయట మండపం మీద పడుకుని పిచ్చిపాటలు పాడుకుంటున్నాడు. కాసేపటికి ఆలయం లోపలినించి ''ఓం ఓం నమఃశివాయ'' అంటున్న శబ్దం గట్టిగా వినిపించి పోలిగాడు హడిలిపోయాడు. ఊరికి దూరంగా వున్న ఆలయంవైపు రాత్రిళ్ళు ఎవరూ రావడానికి భయపడతారు, దెయ్యాల కథలు ఎన్నో విన్న పోలిగాడు భయంతో ఒక్కక్షణం గడ్డకట్టుకుపోయాడు ఇంకా ''ఓం'' అన్న శబ్దం గట్టిగా వినిపించగానే పోలిగాడు దెయ్యం వెంట పడినట్లు గొడ్లను ఎక్కడ వాటిని అక్కడ వదలి వెనక్కి చూడకుండా పరుగు లంకించుకున్నాడు. కాస్తదూరం వెళ్ళాక అక్కడ గొడ్లను మేపుతున వీరిగాడు పరిగెడ్తున్న పోలిగాడ్ని ఆపి ఏమిటలా పరిగెడ్తున్నావు అంటూ అడిగాడు. జరిగింది చెప్పాడు. వీరిగాడు పోలిగాడికంటె పెద్ద. ధైర్యవంతుడు - పోలిగాడ్ని చూసి నవ్వాడు. ''పోరా పట్టపగలు దెయ్యాలుండవు. భూతాలఉ,డవు. దెయ్యాలెక్కడ ఉన్నాయిరా ఏ స్వాములాలో ముక్కుమూసుకు జపం చెయ్యడానికి వచ్చి ఉంటాడు. చూద్దాం పదరా! నీకేటి భయం నేనున్న రారాసూద్దారి'' అంటూ పోలిగాడ్ని ఈడ్చుకొచ్చాడు. యిద్దరూ కలిసి శివాలయం లోపలికి తొంగిచూవారు బూజుపట్టిన ఆలయంలో ఓ మూల దుమ్ము పేరుకున్నచోట పద్మాసనంవేసుకుని కళ్ళు మూసుకుని ''ఓం ఓం'' అంటూన్న శంకరంని ముందు వాళ్ళిద్దరూ గుర్తించలేదు. కాషాయగుడ్డలు కట్టుకుని, గడ్డంకాస్త పెరిగి కాస్త చీకటిగావున్న ఆ చోటులో శంకరాన్ని పోల్చుకోలేదు. ఏదెయ్యమూ కాదని తెలుసుకున్నాక యిద్దరూ లోపలికి నడిచారు. స్వాములవారికి నమస్కారం చేయడానికి దగ్గరకి వెళ్ళారు యిద్దరూ. దగ్గిరకు వెళ్ళగానే పోలిగాడు గుర్తుపట్టేశాడు. ''శంకరం బాబూ'' అన్నాడు ఆశ్చర్యంగా. ఊరంతా శంకరం మాయమవడం గురిచి చెప్పుకోవడం వాడువిన్నాడు. ''మన శంకరం బాబురా!'' అంటూ వీరిగాడితో గుసగుసలాడాడు. ''ఆళ్ళింట్లో అంతా ఈ బాబు ఏంటయిపోతాడోనని ఏడుత్తున్నారురా- ఇంటికిపోయి చెప్దాం రా'' అంటూ పరుగు పుచ్చుకున్నాడు పోలిగాడు.

ఇవార్త వింటూనే శాస్త్రిగారు, కాంతమ్మ నిర్ఘాంతపోయారు, వున్న వాళ్లు వున్నట్టే పరిగెత్తారు. పరిగెడ్తున్న శాస్త్రిగారిని, కాంతమ్మని చూసి ఇరుగు పొరుగు ఏమింటంటూ అడగడం. వెనక వెడుతున్న పోలిగాడు త్రోవన అడిగిన వాళ్ళందరికి ఆ వార్త చెప్పడం - కుతూహలం ఆపుకోలేక కొందరు వాళ్ళవెంట

పరిగెత్తారు. మొత్తంమీద శివాలయం చేరేసరికి ఓగుంపు తయారయింది. అందరూ ఆరాటంగా లోపలికి వెళ్ళారు.

కొడుకుని ఆ ఆవతారంలో చూస్తూనే ''నాయనా శంకరం ఏమిటిరా యిది'' అంటూ గోలపెట్టింది కాంతమ్మ. బాబూ యిక్కడ కూర్చున్నావేమిటిరా. యీ కాషాయ గుడ్డ లేమిటిరా యిదేం ఖర్మరా నాయనా నీకు, యిల్లు వాకిలి వదిలి యిక్కడ కూర్చున్నా వేమిటిరా' అంటూ కాంతమ్మ కొడుకు తలమీద చెయ్యివేసి చేతులు పట్టుకుంది.

'బాబూ! యిటు చూడరా. కళ్ళు విప్పరా ఏమయిపోయావోనని వారం రోజులనించి బెంగపెట్టుకు ఏడుస్తున్నా యిదేం ఖర్మరా నీకు'' శాస్త్రిగారు గద్గదంగా అన్నారు.

స్పర్శకి శంకరం నెమ్మదిగా కళ్ళు విప్పాడు. ఆ కళ్ళు వింతగా ఆయోమయంగా చూవాయి. తల్లితండ్రులను చూసికూడా ఆ కళ్ళు చలించలేదు. చుట్టూ కుతూహలంగా గమనిస్తున్న గుంపుని చూసి ఆశ్చర్యపడలేదు. ఆ కళ్ళు శూన్యంలోకి చూస్తూ భావరహితంగా వున్నాయి. ఆ చేతులు యధా ప్రకారం జపమాల తిప్పుతూనే వుంది.

''బాబూ, ఏమిటిరా యిది. మాట్లాడరా నాయనా... అయ్యో ఆ చూపేమిటిరా! నేనురా అమ్మని, నన్ను గుర్తించలేదూ! అయ్యో....చూడండి. బిడ్డని చూడండి మనతెలివిలో లేడండీ. అయ్యో భగవంతుడా! నీకేం అయిందిరా నాయనా.'' గొల్లుమంది కాంతమ్మ! శాస్త్రిగారు ఆరాటంగా కొడుకు చేయిపట్టుకుని ''బాబూ, మేం ఎవరో తెలుస్తుందా?.... ఎందుకలా అయ్యావు.. అసలు సంగతి చెప్పరా నాయనా'' అన్నారు.

శంకరం అలాగే చూస్తున్నాడు. తల్లిదండ్రులని గుర్తుపట్టలేదు నోరు తెరవలేదు. ''అయ్యో రామచంద్రా! నా బిడ్డకి ఏంగతి పట్టిందిరా దేముడా ఎందుకురా యిలా సన్యాసినయిపోయావు పట్టుమని పాతికేళ్ళు లేని నీకి వైరాగ్యం ఏమిటిరా... మాట్లాడరా నాయనా'' కాంతమ్మ కొడుకు చేయి పట్టుకుని ఏడుస్తూ అంది. ''ఏ దెయ్యమో పట్టుకుంది నా కొడుకుని ఎవరో చేతబడిచేశారురోయ్...''

మునసబుగారు అంతాచూస్తూ ముందుకు వచ్చారు. ''శాస్త్రిగారూ! మీరూ ధన్యులండీ, మీ శంకరం యింక మామూలు శంకరం కాదండీ. చూడండి అతని మొహంలో కనిపిస్తున్న తేజస్సు చూడండి. అతనిలో దైవాంశ ప్రవేశించి. మనిషి

మారిపోయాడు విరాగి అయిపోయాడు.. చూశారా మిమ్మల్ని చూస్తూకూడా గుర్తుపట్టలేకపోయాడంటే అతని పాత జీవితానికి స్వస్తి చెప్పేశాడన్న మాట. ఈ లోకంలో బంధనాలన్నీ తెంచేసుకున్నడు క్రొత్తజన్మఎత్తాడు. ఇంక మీకు అతను కొడుకు కాదు. స్వాములవారిగా అవతరించాడు – దైవస్వరూపుడయిపోయాడు. అలాంటి కొడుకుని కన్న మీరుధన్యులయ్యారు. – మన ఊరు ప్రజలకి నాగ్యం పట్టింది....'' మునసబుగారు అరమోడ్పు కన్నులతో చేతులు జోడించి నమస్కారం పెడుతూ. తన్మయులవుతూ అన్నారు. ఆయన మాటలు వింటూ అందరూ ముందుకు వచ్చి భక్తిగా శంకరం కాళ్ళకి నమస్కారం చేశారు లెంపలు వాయించుకున్నారు.

అంతా చూస్తూ శాస్త్రిగారు, కాంతమ్మగారు అవాక్కయిపోయారు. తమ శంకరం ఏమిటి, దేవుడన్నట్టు అందరూ నమస్కారాలు చేయడం ఇద్దరి కిద్దరూ మతి పోయినట్టు అలా చూస్తూ నిలబడిపోయరు. చూస్తుండగానే వూరు వూరంతా ఈ కబురు పాకి శంకరంని చూడడానికి తర్లి వచ్చేసింది. గుంపులు గుంపులుగా తోసుకుంటూ శంకరం దర్శనంకోసం ఆరాట పడిపోయారు అందరూ ఒకరిని తోసుకుంటూ ఒకరు ముందుకు వచ్చి శంకరం కాళ్ళకి భక్తితో నమస్కారం చేసి కళ్లకద్దుకున్నారు. కొంతమంది అరటిపళ్ళు, మరి కొంతమంది కొబ్బరికాయలు, దొరికిన ఏ పండో పట్టు కొచ్చి భక్తితో శంకరం పాదాల దగ్గిర పెట్టారు.... మునసబుగారు మనిషిని ఇంటికి పంపి వెండిగ్లాసులో అప్పుడే కాచిన పాలు, పంచదార ఏలకుపొడి వేయించి స్పెషల్‌గా తెప్పించి భక్తిగా శంకరం ముందు వుంచారు – ''స్వామీ! వారం రోజులుగా మీరు ధ్యానంలోనే వున్నరు కటిక ఉపవాసంతో యిప్పుడుయినా కాస్త పళ్ళు పాలు తీసుకోండి స్వామీ! ఇవి స్వీకరించి మమ్మల్ని ధన్యులని చేయండి...'' అన్నారు వినమ్రులై.

శంకరంలో కదలిక లేదు. మళ్ళీ కళ్ళు మూసుకున్నాడు. జపమాల యధావిధిగా తిరుగుతూంది. నోరు క్రమం తప్పకుండా మంత్రం జపిస్తూంది.

అందరూ ఆరాటంగా శంకరం కళ్ళు తెరవడంకోసం, తావు తెచ్చిన ఫలాలు స్వీకరిస్తాడో లేదో అన్నట్టు చూవారు. ఎంతసేపటికి శంకరంలో చలనం లేదు.

''నాయనా శంకరం.... కాస్త పాలయినా తీసుకోరా తండ్రీ.. వారం రోజులుగా పచ్చి మంచినీళ్ళయినా లేకుండా యెలా బ్రతుకుతావురా తండ్రీ, రెండు పళ్ళు తిని పాలు త్రాగరా బాబూ....'' అంటూ కాంతమ్మ తల్లి ప్రాణం గోల పెట్టింది.

అప్పటికీ శంకరంలో కదలిక లేదు. మరో రెండు క్షణాలు చూసి ''లాభం లేదు. ఇప్పుడాయన ధ్యానముద్రలో వున్నారు. ఆయన తపో నిష్ఠ పరిసమాప్తి అయ్యేవరకు ఆయన కళ్ళు తెరవరు ఇప్పుడు మనం యిక ఏం చెప్పినా లాభంలేదు.'' అన్నారు మాష్టారుగారు.

''అయితే మరి మనం అంతాఇక్కడుండి ఏంచేస్తాం. ఇక్కడుండి ఆయనధ్యానానికి భంగంకలిగించడం ఎందుకు పదండి వెళ్ళిపోదాం అయన ధ్యానపరిసమాప్తి అయ్యేవరకు వేచి వుండడం మినహా మనం ఏం చెయ్యగలం. పదండి - పదండి'' అంటూ మన్సబుగారు జనాన్ని తర్లించడం మొదలు పెట్టారు. మరోసారి భక్తిగా నమస్కారాలు పెడుతూ జనం ఒక్కొక్కరు వెళ్ళిపోయేరు.

''పదండి శాస్త్రిగారు! మీరు మాత్రం యిక్కడుండి ఏం చేస్తారు. యింటికి వెళదాం రండి'' మాష్టారు అన్నారు. శాస్త్రిగారు, ఏం చెయ్యాలో తోచక నిస్సహాయంగా ఒకసారి శంకరంవైపు చూసి కదిలారు. కాంతమ్మ మాత్రం ససేమిరా అక్కడనించి రానంటూ మొండికేసింది. ''వాడే వేళకి కళ్ళు తెరుస్తాడో, వాడికేం కావాలో, ఏడు రోజులుగా పచ్చి మంచినీళ్ళయినా ముట్టలేదు బిడ్డ. వాడిని వదిలి నే రాలేను. మీరంతా వెళ్ళండి. నేను యిక్కడే వుంటాను. యింటికెళ్ళినా నా మనసంతా యిక్కడే వుంటుంది. వాడు కళ్ళిప్పగానే నా చేతుల్తో రెండు పండ్లు తినిపించుతాను.'' అంటూ అక్కడే చతికిలబడింది ఆవిడ.

''ఏమిటమ్మా మీ వెర్రి. ఎంతసేపని యికకడ కూర్చోగలరు మీరు. ఆయనంటే సర్వం త్యజించిన మనిషి గనక ఆయనకేం అక్కరలేదు. మీరు తిండి తిప్పలు, యిల్లు సంసారం అన్నీ వదిలి ఎంతకని కూర్చుంటారు. ఎప్పటికి ఆయన ధ్యానం పరిసమాప్తి ఆవుతుందో! మనమిక్కడ వంతులవారీగా ఓ మనిషిని కాపలా పెడదాం. ఆయన కళ్లు తెరవగానే కబురు తెస్తారు. అప్పుడు అందరం వద్దాం. మీరుండి ఇప్పుడు చేసేది మాత్రం ఏముంది పదండమ్మా'' అంటూ పెద్దలెందరో ఆవిడకి నచ్చచెప్పి యింటికి పంపారు. శంకరం కళ్ళు విప్పగానే కబురు చెప్పమని మనిషిని ఏర్పాటు చేసి అందరూ యింటి ముఖం పట్టారు.

* * * * *

ఆ మరునాడు సాయంత్ర ఐదు గంటల వేళ శంకరం కళ్ళు విప్పి మాట్లాడుతున్నాడని దాహం అడుగుతున్నాడని కాపలా మనిషి వార్త అందించాడు. ఊరు ఊరంతా ఆరాటంగా శివాలయంవైపు పరిగెత్తింది. శాస్త్రిగారు, కాంతమ్మ

ఆరాటంగా అందరినీ తోసుకుని లోపలి వెళ్ళారు. కొడుకుని చూస్తూనే ''బాబూ శంకరం! ఏమిటిరా యిది... ఎందుకిలా అయిపోయావురా నాయనా'' శంకరం చేతులుపట్టుకుని గద్గదికంగా అన్నది కాంతమ్మ.

ఆ వారం రోజులలో శంకరం కొద్దిగాతగ్గి మొహం నీరసంగా కనుపిస్తున్నా, ఆ కళ్ళు ప్రశాంతంగా వున్నాయి గడ్డం మాసింది.

తన కాళ్ళకి భక్తిగా నమస్కరిస్తున్న ప్రజలని శంకరం వారించలేదు. అసలు అతను అటు చూడడంలేదు. అతని దృష్టి ఎటో వుంది. తన చేతులు పట్టుకున్న కాంతమ్మవంక ఒకసారి చూశాడు కాని అతని దృష్టిలో ఎలాంటి మార్పులేదు.

''మాట్లాడరా నాయనా! ఇదేం ఖర్మరా నాయనా, ఆ చూపు ఏమిటిరా. నేనురా అమ్మనిరా గుర్తించలేదూ?...'' ఆరాటంగా గోల పెట్టింది కాంతమ్మ.

''ఎవరు అమ్మ, యెవరు కొడుకు. అంతా మిధ్యతల్లీ'' నిర్వికారంగా సర్వసంగ పరిత్యాగిలా నిర్లిప్తంగా నవ్వుతూ అన్నాడు శంకరం. అంతా మొహాలు చూచుకున్నారు. మేష్టారుగారు ముందుకు వచ్చి ''స్వామీ, వీరు మీ తల్లి, వీరిని గుర్తించలేదా! మీరెవరో మీకు తెలియదా!'' వినయంగా అడిగారు. శంకరం మరోసారి శూన్యంలోకి చూశాడు. ''అందరికీ తల్లి ఆ జగజ్జనని.'' అంటూ నమస్కారం చేవాడు. మరోసారి అంతా మొహాలుచూసుకున్నారు.

''అయ్యోయ్యో! బిడ్డకి మన తెలివి లేదండి. నా బిడ్డని యెవరో ఏదో చేశారు నన్నే గుర్తించలేకపోతున్నాడు....'' కాంతమ్మ లబోదిబోమంది.

''వూరుకోండమ్మా మీ శంకరం యింక మామూలు శంకరంకాదు ఆయనలో దైవాంశ ప్రవేశించింది. భవ బంధాలు తెంచుకుని ఆయన విరాగి అయి పోయారు, గతం ఆయనకింకలేదు. పునర్జన్మ ఎత్తారు స్వామి అయిపోయారు. మన వూరి ప్రజల ఆదృష్టం యిది - యింక మీరు ధుఃఖించకూడదు....'' అన్నారు మాష్టారు గారు.

చూస్తున్న వాళ్ళందరికి అప్పటికి బాగా నమ్మకం కల్గింది. శంకరం తల్లి దండ్రులకి కూడా గుర్తించ లేకపోవడం, విరాగిలా మాట్లాడడం అతని చూపులు దగ్గరనించి మారిపోవడం చూశాక నిజంగానే స్వామి అయిపోయారని నమ్మారు. అంతా దగ్గిరకి వచ్చి నమస్కరిస్తూ పళ్ళు ఫలాలు దగ్గిరపెట్టి వెడుతున్నారు. శంకరం చిదానంద మూర్తిలా నమస్కరిస్తున్న అందరిని చేయెత్తి ఆశీర్వదిస్తున్నాడు కాంతమ్మ శాస్త్రిగారు నిరశగా,. దుఃఖంగా తల పంకించి. పాతికేళ్ళ కొడుకుయీా వయస్సులో

ఆదుకుంటాడని ఆశించిన కొడుకు సర్వం త్యజించి బైరాగి అయిపోయాడు. మనకున్న ఆధారం తెగిపోయింది. నా చేతులు నరికేశాడు... వాడికేం మహానుభావుడయి పోయాడు. నన్ను నరక బాధలు పడమని వాడు వాడి దారి చూసుకున్నాడు విషాదంగా అంటూ పైపంచతో కళ్ళు వత్తుకున్నారు.

''నాయనా ఒక్క మాట చెప్పరా! నీ వెందుకిలా అయిపోయావో చెప్పరా! విసుగుతో, విరక్తితో ఏదో అన్నామని. యింత పని చేస్తావురా నాయనా! యీ ముసలి కాలంలో మాకింక ఎవరురా దిక్కు....'' ఏదేదో చాదస్తంగా అంటూ ఆశగా కొడుకు ముఖంకేసి చూపిందావిడ. శంకరంలో చలనం లేదు.

''ఏమిటమ్మా మీ వెర్రి, ఆయన కివన్నీ వినిపిస్తాయా యింకా. ఆయన దేవుడయిపోయాడు. అలాంటి కొడుకుని కన్నందుకు మీరు గర్వించాలి, అంతేకాని ఇంక మీరు విచారించడంలో అర్థంలేదు. మీకే లోటు లేకుండా మేమందరం చూస్తాం...'' ఊరి పెద్దలందరూ ఏక కంఠంతో అభయ మిచ్చారు కాంతమ్మకి. ఎంతయినా ఆ తల్లి ప్రాణం కొడుకు అలా అయిపోయినందుకు సంతోషించలేకపోయింది. దుఃఖాన్ని దిగమింగుకుంటూ ''పోనీ నాయనా, నా ప్రాప్తం యింతే అనుకుంటా. ఒక్కసారి - ''అమ్మా'' అని పిలిచి నేను నీ అమ్మనే అని చెప్పు నాయనా'' అంది శంకరం చిరునవ్వు నవ్వాడు.. అమ్మా!.. అన్నాడు... అమ్మా! నీవే కాదు నీలాంటి స్త్రీలందరూ నాకు అమ్మలే అయినప్పుడు నిన్ను మాత్రం ఎందుకు పిలవను తల్లీ - కాని ఇంకా యిలా మిథ్యలోపడి, కొడుకనే వ్యామోహాన్ని పెంచుకోకు తల్లీ.. నీ కొడుకు పునర్జన్మ ఎత్తాడు - అతన్నింక ఈ భవబంధాలు ఏమీ బంధించలేవు... అతనికి కన్పించే భగవంతుని ఆదేశానుసారం నాకు తనయినంతగా అందరికి ఉపయోగపడడమే నా పరమావధి - మానవసేవే మాధవసేవ అన్నాడు ఆ భగవంతుడే; అతని ఆదేశమే ఆచరిస్తాను.. ఆయన కలలో కనిపించి ఉపదేశించిన మంత్రం లక్షసార్లు. జపించేవరకు మౌనవ్రతం పాటించమన్నారు. ఆహార పానియాలు - ముట్టరాదన్నారు. ఏకాగ్రతతో రాత్రింబగళ్ళు ఆ మంత్రం జపించాక నేనింక ఇహలోక బంధనాలనుండి విముక్తి పొంది నాజీవిత విశేషాన్ని ఆ మాధవ సేవలో మానవ సేవలో వినియోగించి నా జన్మ ధన్యం చేసుకొమ్మని ఆ పరమాత్ముడు ఆదేశించాడు... ఆజ్ఞాపించాడు. ఆ ఆజ్ఞకు నేను బద్ధుడనయ్యాను. ఇప్పటితో ఆ మంత్రం లక్షసార్లు జపించడం పూర్తి అయింది. పునర్జన్మ ఎత్తాను. నాకు గతం లేదు. వర్తమానం తప్ప....'' శంకరం ఎటో చూస్తూ అన్నాడు.

''ధన్యులు స్వామీ.. మీలాంటి వారుండటం మా ఊరి అదృష్టం - మీ దర్శనభాగ్యంతో మేము ధన్యులం అయ్యాం.. మీ వంటి మహాత్ముల సేవ చేసుకునే భాగ్యం మాకు దొరకడం మా పుణ్యం స్వామీ... ఇన్నాళ్ళు కటిక ఉపవాసలలో వున్నారు... యిప్పుడిక కాస్త భోజనం తినండి స్వామీ..'' కరణంగారు వినయంగా అన్నారు.

''భోజనం భోగులకికాని యోగులకి కాదు.. ఈ జీవిని నిల్పుకోడానికి మాకు కందమూలయినా చాలు.. అపరిపక్వ ఆహారం మాత్రం స్వీకరిస్తాం యీ పాలు రెండు పళ్ళు మాత్రం చాలు...'' అంటూ శంకరం అందరూ తీసుకువచ్చిన పళ్ళు రెండు వుంచుకుని మిగతావి భక్తిగా కాళ్ళంటి నమస్కరిస్తున్న అందరికీ పంచేశాడు. అందరూ మహాప్రసాదం అన్నట్టు కళ్ళకద్దుకుని తీసుకున్నారు.

★ ★ ★ ★ ★

ఆరు నెలలు తిరిగేసరికి పూర్వాశ్రమంలోని శంకరం శంకరానంద స్వామి అయ్యాడు. ఆ పల్లెటూరేకాదు ఆ చుట్టుప్రక్కల గ్రామాలవాళ్ళందరూ రోజూ శంకరానందస్వామిని దర్శించడానికి తీర్థ ప్రజల్లా రోజూ వస్తారు, గ్రామాలవాళ్ళే కాదు చుట్టుప్రక్కల బస్తీలవాళ్ళూ, దైవభక్తివున్న అందరూ క్రొత్తస్వామివారిని దర్శించడానికి వస్తారు.

శంకరానందస్వామి ఉదయం ఒక గంట సాయంత్రం ఒక గంట తనని దర్శించడానికి వచ్చే ప్రజలకి దర్శనం యిస్తారు. ఆయన ఎవరివద్ద ఏ కానుకలు తన కోసం స్వీకరించరు. పళ్ళు ఫలాలు తనకోసం కొన్ని అట్టిపెట్టుకుని మిగతావి తనని చూడవచ్చే భక్తులందరికీ పంచిపెడతాడు. డబ్బు రూపంలో వస్తురూపంలో, వస్త్రరూపంలో ధనికులు ఇచ్చినవి స్వీకరిస్తారు. కాని అవన్నీ బీద ప్రజలకు అయనే స్వయంగా దానం చేస్తారు.

ఆయన తెల్లవారకుండానే లేస్తారు. కాలకృత్యాలు తీర్చుకుని ఓ గంట జపం, తపం పూర్తి చేసుకుని ఓ గ్లాసుడు పాలుత్రాగుతారు. ఆ తర్వాత తన దర్శనార్థం వచ్చిన వారికి దర్శనం యిస్తారు. ప్రజలు చెప్పుకునే గోడు వింటారు. తన మీద నమ్మకముంచి ఆయనేదో దేముడన్నట్టు తమబాధలు పోగొట్టగలడన్న నమ్మకం వచ్చినవారికి ఆయన స్వాంత వచనాలు చెపుతారు. కోరినవారికి ఆయన తీర్థం యిస్తారు. ప్రజలు ఆయన తీర్థంతో తమ కోరికలు తీరిపోయినట్లు మహదానందపడతారు. ఆ తర్వాత ఊర్లో పిల్లలందరికి ఆయన చదువు చెపుతూ

రెండు గంటలు గడుపుతారు. ఆ తర్వాత స్నానం, పూజచేసి ఫలాలు పాలుతీసుకుంటారు మధ్యాహన కాసేపు విశ్రమించి లేచి తిరగి తన దర్శనంకోసం వచ్చినవారిని కనిపిస్తారు. ఆతర్వాత సాయంత్రం ఊర్లో పెద్దలందరో రాగా భగవద్గీత, భారతం, రామాయణమో చదివి విన్పిస్తారు. రాత్రి ఒక గంట పల్లెటూరి రైతులకి చదువు చెపుతారు. రాత్రి ఒక గంట భజన - ఆ తర్వాత ఫలహారం చేస్తారు. ఆ తరువాత ఒక గంట ఆయన వాహ్యాలికి ఎడతారు. తొమ్మిది గంటలకి నిద్ర - యిదీ ఆయన కార్యక్రమం. ఆ వూర్లో వారికి ఆయన దేముడు! ఆ పాడుపడిన శివాలయమే ఆయన నివాసస్థానం. కాని యిప్పుడు దాని రూపు మారిపోయింది. ఊర్లో పెద్దలందరూ కలిసి ఆలయం బాగుచేయించారు. ముందు స్థల మంతా బాగుచేయించి పందిళ్ళు వేయించారు. దర్శనానికి వచ్చే ప్రజలందరికి కనిపించేట్టు ఆయన కూర్చోడానికి మండపం కట్టించారు. ఊర్లో వాళ్ళు వంతుల ప్రకారం పాలు తెస్తారు ఆయనకి. పిల్లలకి పెద్దలకి చదువు చెప్పడానికి వీలుగా ఒక బోర్డు, రాత్రికి పెట్రోమాక్సు లైటు అన్నీ ఏర్పాటు చేశారు. వచ్చేపోయే ప్రజలకోసం చిన్న చిన్న దుకాణాలు అక్కడ వెలివాయి. యిప్పుడు పాడుపడిన శివాలయం ఆ ఆవరణ రాత్రింబగళ్ళు కళకళలాడే తిరునాళ్ళలా వుంది. ప్రజలందరికి శంకరానందస్వామిపట్ల భక్తి విశ్వాసాలతోపాటు ఎంతో గురి! వూరు అయన వల్ల బాగుపడిందన్న కృతజ్ఞత అందరిలో వుంది. పిల్లలకి నాలుగు మంచి ముక్కలు నేర్పుతున్నందుకు వూర్లో వరద వచ్చినా కరువువచ్చినా, రోగాలు వచ్చినా శంకరానందసావమి నడుం కట్టుకుని ప్రజలకి అండగా నిలుస్తారని అయన్ని తమ పాలిట ప్రత్యక్షదైవంలా కొలుస్తారు అందరూ. ఆ నోట ఆ నోట ప్రాకి చుట్టు ప్రక్కల ప్రజలందరూ శంకరానంద స్వామిని దర్శించడానికి వస్తారు. ఏవేవో కోరికలతో వచ్చే ప్రజలకి నేను దేముడ్ని కాను. ఆ భగవంతుడిమీద విశ్వాసం వుంచండి. ఆని మాత్రం చెప్పినా అందరికీ ఆయన సందర్శన భాగ్యంతో తమ కోరికలు ఈడేరుతాయని నమ్మకం. ఆయన యిచ్చే తీర్థంలో మహత్తు వున్నట్లు నమ్ముతారు. కాంతమ్మ శాస్త్రిగారు శంకరానందస్వామి తన కొడుకన్న విషయం గుర్తున్నా ఆయన్ని వాళ్ళూ దేముడన్నట్టే భావించి ప్రజలందరితోపాటు దర్శనానికి వెడుతుంటారు ఆయనకి భక్తిగా నమస్కరిస్తారు. కొడుకులేని లోటు ఊర్లో అందరో తీరుస్తున్నారు వాళ్ళకి. ఊర్లో పెద్దలంతా వంతులు వేసుకున్నట్టు ధాన్యం బస్తా ఒకరిస్తే. కందులొకరు మినుములొకరు ఎవరి పొలంలో పండేది వాళ్ళు వాళ్ళకి పంపుతో శంకరానందస్వామి తల్లిదండ్రులని ఆదుకున్నందుకు సంతోషపడ్డారు.

శంకరానందస్వామి పూర్తియోగిగా మారిపోయారు గడ్డం పొడుగ్గా పెరిగింది. జుత్తు భుజాలుదాటి పెరిగింది. ఆయన శరీరంలో కళ్ళల్లో ఏదో కాంతి ప్రవేశించింది. ఆయన మొహంలో ఏదో వింత తేజస్సు, పెదాల మీద సదా చిరునవ్వు ఆయన మాటల్లో మృధుత్వంతోపాటు గంభీరతచోటు చేసుకున్నాయి. ఆయన్ని చూడగానే భక్తిగా నమస్కరించకుండా ఉండలేరు ఎవరో. ఇది వరకు ఆయన్ని తెలిసినవారుకోడా తొందరగా గుర్తంచలేనంత మార్పు వచ్చింది.

★ ★ ★ ★ ★

ఆరోజు సత్యం ఊరినించి వచ్చాడు. సత్యం, శంకరం ప్రాణ స్నేహితులు. ఒకటో క్లాసునుంచి కాలేజి వరకు కలిసి చదువుకున్నారు. ఇద్దరూ కలిసి ఒకేసారి డిగ్రీ పొందినా శంకరాన్ని వరించని ఉద్యోగం సత్యాన్ని వరించడంతో సత్యం ఉద్యోగం. వూరికి వెళ్ళాడు. ఎనిమిది నెలల తరువాత స్వగ్రామం చేరిన సత్యం శంకరం గురించివిని ఆశ్చర్యపోయాడు. వివరాలడిగి తెల్లపోయాడు. ఉన్నపాటున వెళ్ళి మిత్రునిచూశాడు. ప్రజలకి దర్శనం యిస్తున్న శంకరానందస్వామితో అప్పుడు ఏకాంతంగా మాట్లాడే వీలు లేక ఆయన యెప్పుడు వంటరిగా వుండేది తెలుసుగుని మధ్యాహ్నం వంటరిగా వెళ్ళాడు.

అప్పుడే విశ్రాంతి తీసుకోపోతున్న శంకరానందస్వామిని చూస్తూనే ‘‘శంకర్ ఏమిటిరా ఇదంతా’’ అని నిలేశాడు సత్యం.....‘‘ఏమిటిరా ఈ వేషం..’’ అంటూ ఆరాటంగా ప్రశ్నించాడు.

శంకరానందస్వామి చిరునవ్వుతో కూర్చోమని సైగచేశారు... ‘‘నీ యిష్టం వచ్చిన పేరుతో నన్ను పిలవచ్చుగాని. ప్రస్తుతం యిప్పుడది నాపేరుగాదు’’ అన్నాడు.

‘‘ఏడిశావులే.. వెర్రికబుర్లు మాని అసలు సంగతి ఏమిటో చెప్పు... యీ సన్యాసి వేషం ఏమిటి? యీ గడ్డాలు మీసాలు ఏమిట? నీవు యోగివవడం ఏమిటి? ఏమిట్రా యిదంతా! సరిగా జవాబు చెప్పు.... లేకపోతే ఆ గడ్డం పీకుతా’’ దూకుడుగా అన్నాడు సత్యం పాతచనువుతో.

‘‘అంటించుకున్న గడ్డం కాదు నాయనా ఇది.. చూస్తే ఎందుకు అని అడిగితే ఏం జవాబు చెప్పను... సన్యసించడానికి కారణం ఏముంటుందీ - ఐహిక సుఖాలమీద విరక్తి కలగడం... అంతే కారణం.... భగవంతుని సేవకు నన్ను నేను అర్పించుకున్నాను...’’ చిదానంద మూర్తిలా చిరు నవ్వుతో సౌమ్యంగా అన్నారు స్వామి.

‘‘వరేయ్ గడ్డాలు, మీసాలు పెంచి కాషాయి గుడ్డలు కుట్టకున్నంత మాత్రాన నీవు దేవుడయిపోయావని ఈ ఊర్లో ప్రజలు వెర్రి వెధవలు కనక నమ్మారు. కాని

నేనంత ఫూల్‌ను కాదురా... అసలు విషయం చెప్పు... యిలా మారడానికి కారణం ఏమిటి? ఎందుకు ఈ వేషం వేశావు - ఏమిటీ నాటకం? ఎవరిని మోసం చేయడానికిరా ఈ వేషం అసలు పట్టుమని పాతికేళ్ళులేని నీకి ఖర్మ ఏమిటిరా!.... అసలు ఏం జరిగిందో ముందు చెప్పు అంతా చెప్పు -'' ఆరాటంగా అడిగాడు సత్యం.

''నీకంత వినాలని కూతూహలంగా వుంటే దాచాలని నాకు లేదు.'' అంటూ గడ్డం సవరించుకుని ఎటో చూస్తూ చెప్పసాగాడు శంకరానంద స్వామి --- నిజమే ఈ ప్రపంచంలో సవ్యంగా బ్రతకగలిగే మార్గం కనపడక. బరువు బాధ్యతలు నెరవేర్చవలసినవాడిని మరోకరికి బరువయి వారి దయాదర్మంమీద బ్రతికే జీవచ్ఛవం బ్రతుకు బ్రతకలేక. నా బరువు బాధ్యతలనించి తప్పించుకోడానికి యింత కంటె మంచి ఉపాయం కనపడక యీ అవతారం ఎత్తాలని ఈ ఆసరాతో నా బ్రతుకు నిశ్చింతగా గడపాలనే యీ ఎత్తు వేశాను మొదట. ఎన్నాళ్ళు ఉద్యోగం సద్యోగం లేకుండా యింట్లో సూటీపోటీ మాటలను భరించగలను? భయపెట్టె వర్తమానం, భరోసా లేని భవిష్యత్తు ఎటు చూచినా చీకటే! అత్మహత్య మినహా శరణ్యం లేదని పించింది. అలాంటి ఆనిశ్చయ స్థితిలో పత్రికలలో ఓ వార్త నన్నాకర్షించింది. ''ఎవరో ''బాబా''ని దేముడన్నట్టు ప్రజలు ఎలా కొలుస్తున్నారో ఆయన చేసే కనికట్టు విద్యలని మహత్తులుగా భ్రమసి ఆయన పట్ల ఎంతగా భక్తి విశ్వాసాలు ఏర్పరచుకున్నారో! ఆయనకి రాజభోగాలు ఎలా సమకూరుతున్నాయో చదివాను. అప్పుడే ఈ ఆలోచన తళుక్కుమంది నాకు. ఆ ఆలోచన బాగా నాటింది. కాషాయ గుడ్డలు కట్టుకున్న వాళ్ళందరూ సన్యాసులుగా స్వామిజీలుగా చలామణి అవుతూ మన్ననలను ఆందుకుంటూండగా, అలాంటి వాళ్ళని నమ్మే ప్రజలుండగా వాళ్ళల్లో నేను ఒకణ్ణి ఎందుకు కాకూడదనిపించింది. బ్రతుకు తెరువుకి యింత కంటె మంచి మార్గం నా కెక్కడ దొరుకుతుంది. ఏదో ఉద్యోగం దొరికినా ఆ చాలీచాలని జీతంతో తీర్చవలసిన బాధ్యతలు. క్రొత్తగా మీదపడే బంధాలు - వీటన్నిటిమధ్య ఊపిరి ఆడకుండా చావలేక బ్రతకలేక ఆ బ్రతుకు కంటె యిది ఎన్నో రెట్లు మేలని పించింది. భూతాల్లా ఎదుట నిలబడి భయపెట్టే బాధ్యతలు, వెలుగు కనబడే ఆశలేని భవిష్యత్తునుంచి తప్పించుకోడానికి ఇంత కంటే మంచి మార్గం ఏముంటుంది! రెండు రోజులు తీవ్రంగా ఆలోచించాను. ఇదీ అన్నంత సుళువు కాకపోవచ్చు. ప్రజలలో కాస్తో కూస్తో నమ్మకం కలిగించాలి. కనీసం కొన్నాళ్ళయినా స్వసుఖాన్ని త్యాగం చెయ్యాలి. ఇది నా వల్ల అవుతుందా అని అలోచించాను. ఎంత ఆలోచించినా నే బ్రతికే, బ్రతకబోయే బ్రతుకుకంటే యిదే నయం అనిపించింది. వెంటనే కార్యాచరణలోకి దిగాను. స్వామీజీ వేషానికి కావల్సిన పరికరాలు అతి కష్టంమీద అప్పుచేసి సమకూర్చుకున్నను. నా ప్లాను ఏమిటంటే ఓ నాలుగైదు రోజులు

ఎవరి కంటపడకుండా యీ పాడుబడ్డ శివాలయంలో దాక్కోవాలని యింట్లో వూర్లో అంతా నాకోసం వెతుక్కుని ఆరాట పడ్డాక ఓ రోజుయిక్కడ సన్యాసి వేషంలో ఊరివాళ్ళకి కనిపిస్తే నేను సన్యసించానని యిహలోక చింతలకి దూరమయ్యానని అందరికి భ్రమ కల్గించి అందరినినమ్మించాలని నాప్లాను. యిక్కడకు పశువుల కాపర్లు వస్తుంటారని ఎవరో ఒకరు నన్ను చూస్తారని నాకు తెలుసు. కనక అంతా అనుక్కున్న ప్రకారం జరుగుతుందని నేను స్వామి నయ్యానని ఊళ్ళో అంతా నమ్మి దేముడిలా కొలిచి పళ్ళు ఫలాలు కోరకుండా వచ్చిపడతాయని నా భుక్తికి ఏం లోటుండదని నాకు తెలుసు.

అనుకున్న ప్రకారం ఒక రోజు యింట్లోంచి మాయమయి యిక్కడకు చేరాను. పగలంతా ఎవరన్నా చూస్తారేమోనని భయంతో ముక్కు మూసుకుని పద్మాసనం చేసుకుని ధ్యానంలో వున్నట్టు నటించే వాడిని. రాత్రిళ్ళు పడుకునేవాడిని.

"మరి.. ఆ వారం రోజులు తిండి తిప్పలు ఏం లేకుండా ఎలా వున్నవు?" వింటున్న సత్యం ఆశ్చర్యంగా అడిగాడు.

"ఆ జాగ్రత్త ముందే పడ్డాను. ఐదారు రోజులకి సరిపడ్డ బన్ రొట్టెలు బిస్కట్లు. అరటి పండ్లు. ఒక కుండెడు మంచినీళ్ళు ఎవరి కంట పడకుండా దాచుకున్నాను. ఐదు రోజులు గడిచానా నా ఉనికి ఎవరూ గుర్తించలేదు. ఏ పశువుల కాపర్లో వచ్చినా లోపలికి రాలేదు. ఎంత జాగ్రత్తగా వాడుకున్నా ఆరో రోజుకి ఏమీ మిగలలేదు తినడానికి. ఒకటే ఆకలి! ఆరురోజులయి భోజనం లేదు. ఎవరూ గుర్తించకపోతే నాప్లాను వృధా, అని ఆరాటం! ఏరాత్రో ఊర్లోకి వెళ్ళి ఏదన్నా కొనుక్కుందాం అన్నా ఎవరి కంటన్నాబడితే యింత శ్రమ వృధా అయిపో తుందన్న భయం! ఏడో రోజు కటిక ఉపవాసం! ఆరోజుకూడా ఎవరూ చూడకపోతే ఆకలికి చచ్చిపోతానని భయం వేసింది! ఆకలి భరించడమూ కష్టమయింది. బాగా ఆలోచించి ఆలోచించి ఆ రోజు పశువుల్ని మేపడానికి కుర్రాడు బయట కూర్చుని ఏవో పాడుకుంటూంటే వాడ్ని ఆకర్షించడానికి గట్టిగా "ఓం ఓం అనడం ఆరంభించాను. ఆ ప్రయత్నం ఫలించింది. వూరంతా వచ్చారు. ఎవరిని చూడ నట్టు గుర్తుపట్టనట్టు, అమ్మా, నాన్నకూడా ఎవరో తెలియనట్టు నటించాను. ఎవరెన్ని విధాల అడిగినా నోరిప్పలేదు. ధ్యానంలో వున్నట్టు నటించాను. నేను యోగిని అయ్యానని సన్యసించానని అందరూ నమ్మారు భక్తిగా దండాలు పెట్టి పళ్ళు ఫలాలు పెట్టి నా ధ్యానం పరిసమాప్తి కొరకు. ఎదురు చూడాలని కాపలాకి మనిషినిపెట్టి వెళ్ళారు. ఎదుటవున్నపాలు. పళ్ళు నా ఆకలిని రెట్టింపుచేశాయి. కాని యెదుట మనిషి ఆఖరికి ఆ మనిషి కొన్ని నిమిషాలు నన్ను చాటు అయిన సమయం

చూసుకుని రెండు అరటి పళ్ళు నోట్లో కుక్కుకుని అరగ్లాసుడు పాలు నోట్లో పోసుకుని మిగతావి క్రిందకు వంపేశాను. ఎవరయినా చూసి ఓలికిపోయాయి అను కోవాలని! వంతులువారిగా మనుష్యులు వుండడంతో నిద్రపోవడానికీ లేదు. తప్పని సరిగా పద్మాసనం వేసుకుని జపమాల తిప్పుతూ కూర్చున్నాను. ఎలాగో కూర్చున్నా నుకదా అని ''ఓం'' కార శబ్దాన్ని ఏకాగ్రతతో జపించాను, ముందు పది నిమిషాలు ఏకాగ్రత చెదురుతూ మనసు లగ్నం చెయ్యలేక పోయినా పంతంకొద్ది తరువాత ఓ గంట జపించగలిగాను.ఆ గంట అయ్యాక మరోగంట చూద్దాం అని పించింది తర్వాత ఎలాగో కూర్చోక తప్పదు. ఈ రోజంతా ఏకాగ్రత చెడకుండా మనసు చెదరకుండా దీక్షగా జపించగలనా అన్న కోరిక, పట్టుదల కలిసి ఆ రోజంతా జపమాల తిప్పుతూ ఓంకారాక్షరి మంత్రాన్ని జపించాను. నా ఏకాగ్రత దీక్ష నాకే ఆశ్చర్యం కలిగించింది. పట్టుదల ఉంటే సాధించలేనిది వుండదనిపించింది. అన్ని టికంటే ఆ ఏకాగ్రత నా మనసుని ఎంతో ప్రశాంతంగా వుంచంది. బాధలు, కష్టాలు, ఆకలి నిద్ర అన్నింటిని మరిపించి అన్నింటికి అతీతంగా ఏదో అనిర్వచనీయమైన తదాత్మ్యం కలిగించింది. ఆ మంత్రం జపిస్తున్నకొలది నాకు బాహ్య స్మృతి పోయినట్లు, మనసెటో గాలిలో తేలిపోతున్నట్లు, ముందు అంతా కళ్ళ ముందు చీకటి వలాయలు. ఆ తర్వాత ఏదో పెద్ద వెలుగుతప్ప ఏదీ కనపడని ఆ స్థితిని - ఇది అని చెప్పలేని అనుభూతికి లోనయ్యాను. ఆకలిని, నిద్రని ఆరోజుకి జయించగలిగాను; కూర్చోడం తప్పనిసరి గనక అలాగే దీక్షగా మంత్ర జపిస్తూ కూర్చున్నాను. తిరిగి అదే అనుభూతికి లోనయ్యాను. పెద్దలు చెప్పే తపస్సు అంటే యిదే కాబోలు అన్పించింది. అంతటి ఏకాగ్రత, మనో నిగ్రహం అలవరుచుకున్న అనాటి యోగులు, ఋషులు, మునులు దైవ స్వరూపులుగా చెలావణి అయ్యారంటే దానికి కారణం అర్థం అయింది నాకు. రెండు రోజుల ధ్యానముద్రలోనే నేనింత మనోనిగ్రహాన్ని, మనశ్శాంతిని సాధించానంటే ఏళ్లతరబడి తపోనిష్టలో వుండే ఋషులు తమ తపశ్శక్తితో దైవత్వాన్ని సంపాదించే వారంటే ఆశ్చర్యం ఏముంది? తపస్సు అంటే ఏకాగ్రత, ఏకాగ్రతని సాధించడానికి సాధన, దీక్ష అవసరం. ఆ సాధనే తపస్సు! మనో నిగ్రహంతో, ఐహిక సుఖాలని త్యాజించి, అహం విడిచి స్వార్థత్యాగం చేయగలిగిన వాడు మిగతా వారికంటే ఆతీతుడు! అది సాధించిన ఆనాటి ఋషులు, మునులు అందుకే దేముళ్లుగా చలామణి అయ్యారు. ఆ పరమ సత్యం గుర్తించాక, నాకు ఏదో జ్ఞానోదయం అయినట్లయింది. అబద్ధంగా ఆరంభించిన నా నాటకం నిజం చెయ్యాలనిపించింది. లోకాన్ని మోసగించి సన్యాసిగా చలామయి అయ్యే కంటే నిజంగా అన్నింటిని త్యజించి పూర్తిగా దైవధ్యానంలోనే నా శేషజీవితం గడుపుతూ చాతనయినంతగా మానవసేవ చేయడం నా ధర్మంగా గుర్తించాను. ఆ రెండు రోజులు నా ధ్యాననిష్ట

నాకు మనోనిబ్బరాన్ని ప్రసాదించింది. ఆ రెండు రోజుల తర్వాత నిజంగానే నేను పునర్జన్మ ఎత్తాను. నేనెవరో తెలియనట్లు ముందర అందరిదగ్గరా నటించాను. ఆ రెండు రోజుల తర్వాత - నేనెవరో నాకు తెలిసిన ఆ నిజాన్ని మరిచి పోగలిగే సాధన నాకు నా ధ్యానం సమకూర్చగలదని నమ్మాను.

అంతే, నన్ను ప్రజలు స్వామిగా గుర్తించారు. పూజించారు పూజిస్తున్నారు. ఎవరినో మోసం చెయ్యాలన్న ఆలోచనతో ఆరంభించిన ఈకార్యం ఈనాడు మోసం చెయ్యకుండానే నన్ను నేను వంచించుకోనక్కరలేకుండా నాకు తోచింది అందరికీ చేస్తూ నా జన్మకి ఓ అర్థం సమకూరిందన్న సంతృప్తితో బ్రతుకుతున్నాను. ఎవరిస్తేనేం నా కారణంగా బీద ప్రజలకి పళ్ళు ఫలాలు తరుచు దొరుకున్నయి! పూజల పేరుతో, పర్వదినాల పేరుతో నన్ను సంతృప్తి పరచడానికి ధనికులు చేసే అన్నదానాలు బీద ప్రజలకడుపునింపుతున్నయి. వరద వచ్చినా కరువు వచ్చినా నే జోలిపట్టి అడిగితే లేదనే వారుండరు. అవన్నీ లేనివారిని ఆదుకుంటాయి. నాకు వచ్చిన నాలుగు ముక్కలు పదిమందికి నేర్పుతున్నాను: చిన్నప్పుడు నాన్న బలవంతాన చదివించిన సంస్కృత విద్య పురాణ గ్రంథాలు చదివి విన్పిచడానికి తోడ్పడుతుంతి యింతకంటె జన్మకి సార్థకత ఏముంటుంది? చాలీ చాలని జీతాలతో, రోగాలతో, ఆకలితో, ఏడ్పులతో బ్రతికే ఆ జీవితంకంటే యిది ఎంత మెరుగు! అయితే అందరూ యిలా ఆలోచించలేరు. ఆలోచిచితే సృష్టి ఆగిపోతూంది. అలా ఆలోచించి ఆచరణలో పెట్టగలిగినవారు అందుకే దేముళ్ళుగా చలామణి అవుతున్నారు. నేను చెప్పేది పొట్టకూటి కోసం కాషాయగుడ్డలు కట్టుకునే దొంగ సాధువులు, సన్యాసులు, కనికట్టు విద్యలని మహత్తులుగా భ్రమింపచేస్తూ ప్రజలచేత మన్ననలను అందుకునే బాబాలు, మాట కాదు-''

అవాక్కయి వింటున్న సత్యం... ''మరి నీలో ఏ మహత్తులులేవా? ఏ మహిమలు లేకుండానే ప్రజలు నిన్ను ఎలా నమ్మారు? నీ పట్ల యింత భక్తి విశ్వాసాలు ఎలా ఏర్పడ్డాయి?'' ఆశ్చర్యంగా ఆడిగాడు.

''కాషాయగుడ్డలు కట్టుకు అడుక్కుతినే సన్యాసికైనా ఓ నమస్కారం పెట్టే, కనిపించిన రాయిరప్పలకి మొక్కే ఆమాయక ప్రజలువున్న మన దేశంలో నన్ను మాత్రం ఎందుకు నమ్మరు! నేనేం వరాలిస్తానని చెప్పలేదు. నా దగ్గరకు వచ్చేవాళ్ళకు మీ ప్రయత్నం మీరు చెయ్యండి. భగవంతునిపట్ల నమ్మకం వుంచండి అని మాత్రం చెప్పాను. నేనేదో చేస్తానని చెయ్యగలనని ఎవరిని నమ్మించలేదు. నేను సర్వం త్యజించడం, భోజనం దగ్గరనించి మానడం, నా కోసం కాక యితరుల కోసం నేను పాటు పడడం చూసినా పట్ల వాళ్ళకి విశ్వాసం జనించి వుంటుంది. నా కారణంగా వారు బాగుపడిందని, పూజలు, పురాణాలు జరుగుతున్నాయని

బీదలకి అన్నవస్త్రాలు దొరుకుతున్నాయని వాళ్ళ కష్టసుఖాలలో తోడునీడగా వుంటున్నానని అందరికి నామీద భక్తి విశ్వాసాలు కుదిరివుంటాయి. ఎవరినించి ఏమీ ఆశించకుండా నీపని నీవు చేసుకుపో! ప్రపంచం నీ కాళ్ళముందు వాలుతుంది ఏదన్నా అడిగావా చెట్టెక్కుతుంది'' అని ఎవరో అన్నమాట నా విషయంలో నిజం-''

''మరి మీ అమ్మానాన్న...''

ఏమంటారు! ముందులో ఏడిచారు. తరువాత నిజంగానే నేను మారానని నమ్మారు నావల్ల వూళ్ళో అందరికి పూజ్యులయి, వూరి పెద్దలంతా ఆదుకుంటూంటే హాయిగా వున్నారు. నేనుండి అంతమాత్రం చేయగలిగేవాడినా!

సత్యం ఆశ్చర్యంగా శంకరాన్ని పరీక్షిస్తూ ''నీలో చాలా మార్పు వచ్చింది, నీ మొహంలో నీ కళ్ళలో ఏదో వెలుగు, మొహమే కాదు. శరీరంలోనే, ఏదో తేజస్సు గోచరిస్తూంది. ఈ మార్పు నా భ్రమా, నిజమాయిదెలా సాధ్యం ఏ మహత్తూ లేకుండా.''

శంకరానంద స్వామి చిరునవ్వు నవ్వారు - ''అవకాయ ముక్కతో ఆర్థాకలితో నిండే కడుపుకి - యిప్పుడు ఆరోగ్యకరమైన పాలు, పళ్ళు తేనె తింటే వచ్చే నిగారింపు యిది. పులుపు కారాలు విసర్జించి, చన్నీటిస్నానాలు, యోగాభ్యాసం నియమబద్ధమైన జీవితం చీకు చింతలేని మనశ్శాంతి యివన్నీ మానసికంగా ఆత్మ విశ్వాసాన్ని, మనోనైర్మల్యాన్ని ప్రసాదిస్తాయి. ఆ ఆత్మవిశ్వాసం తాలూకు నీడలే నీవనుకునే కళ్లలో వెలుగు, ఆరోగ్యకరమైన అభ్యాసాలు శరీరానికి ధృడత్వాన్ని, నిగారింపునిస్తాయి, ఆ నిగారింపే నీవనుకునే తేజస్సు, ఐహికసుఖాలని త్యాగంచేయడానికి కొంతసాధన అవసరం. మనో నిగ్రహం సంపాదించగలిగే ఏకాగ్రత సాధించాను ఇప్పుడు. అందుచేత నేనిప్పుడు శంకరాన్ని కాదు. శంకరానందస్వామిని అయ్యాను.'' చిరునవ్వుతో అన్నారు శంకరానందస్వామి.

సత్యం ఏమనాలో తోచనట్లు ఆయనవంక అలాచూసాడు కొన్ని క్షణాలు, యింకా ఏదో అడగాలనివున్నా ఆయన దర్శనంకోసం ప్రజలు కాచుకొని వుండడంచూసి లేచాడు.

అతనికి తెలియకుండానే అప్రయత్నంగానే చేతులు జోడించాడు.

(స్వాతి వీక్లీ - 1970)